ప్రజాశక్తి
మంగళవారం 5 మార్చి 2024 5 శ్రీ సత్యసాయి

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు
- సంక్షేమంలో ఎలాంటి కోతలుండవ్..
- 'రా కదలిరా' సభలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు



రా..కదిలి రా బహిరంగ సభకు హాజరైన టిడిపి శ్రేణులు, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పెనుకొండ

టిడిపి అధికారంలోకి వచ్చాక అనంతపురం జిల్లాలోని పేరూరు, బిటిపి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని నారా చంద్రబాబు నాయడు హామీనిచ్చారు. టిడిపి చేపట్టిన 'రా కదలరా' కార్యక్రమం మగింపు సభ పెనుకొండలో సోమవారం జరిగింది. కియా పరిశ్రమ ఎదుట ఏర్పాటు చేసిన ఈ సభకు అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి వేలాదిగి టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు తరలొచ్చారు. ఈ సభలో చంద్రబాబునాయుడు వైసిపిపై విమర్శలు గుప్పిస్తూనే తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామన్న దానిపైనా హామీలిచ్చారు. పేరూరు ఎత్తిపోతలను పూర్తి చేస్తామని, బిటిపికి నీటిని అందిస్తామని హామీనిచ్చారు. అదే విధంగా డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీని 90 శాతంతో మునుపటిలాగా ఇస్తామని హామీనిచ్చారు. రైతులకు సోలార్ పంపుసెట్లు అందజేసి విద్యుత్‌కు ఖర్చు లేకుండా చేస్తామన్నారు. రాయలసీమ ప్రాంతాలో సాగునీటికి ప్రాధాన్యతనిచ్చింది టిడిపినే అని చెప్పారు. గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లు పూర్తి చేసామని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఈప్రాజెక్టులను విస్మరించారన్నారు. ఇటీవల రాప్తాడు జరిగిన సిద్ధం సభలోనైనా ఈ ప్రాంతానికి ఏమి చేశానన్నది వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చెప్పాలేదని విమర్శించారు. టిడిపి అధికారంలోనున్న ఐదేళ్లలో సాగునీటి కోసం రూ.64 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. భవిష్యత్తులోనూ సంక్షేమంలో కోతలల్లేకుండా ప్రజలకు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉపాధి కోసం బెంగళూరు ఇతర ప్రాంతాలకు వెళితే వెంటనే పింఛన్లు తొలగిస్తున్నారని, అలాకాకుండా మూడు మాసాలైనా తొలగించకుండా ఇస్తామని హామీనిచ్చారు. సత్యసాయి జిల్లాలో వైసిపి ఎమ్మెల్యేల అక్రమాలు అన్నీఇన్నీ కావని ఒక్కో ఎమ్మెల్యే గురించి చంద్రబాబు వివరించారు. వీరు పెద్దఎత్తున ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. కొంత మందిని వేరే ప్రాంతాలకు బదిలీలు చేసారని తెలిపారు. నియోజకవర్గం మారితే ఇక్కడ చెత్తగానున్నది అక్కడ స్వర్ణమవుతుందా అని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నిల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ టిడిపి గెలిపించాలని, అందుకోసం ఈ నలభై రోజులు అందరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో ఆర్థికంగా ఎంతో దెబ్బతిందన్నారు. ఉద్యోగులకు వేతనాలు రావాలన్న అప్పులు పుట్టాల్సిందేనని అన్నారు. సంక్షేమ రాజ్యాం టిడిపితోనే సాధ్యమని చెప్పారు. సిద్ధం అని చెబుతున్న ముఖ్యమంత్రి దేనికి సిద్దమో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగులకు పిఆర్‌సి ఇస్తామని ఇవ్వకుండా ఉన్నందుకు సమాధానం చెప్పడానికి సిద్ధమా... బాబాయ్ హత్య కేసులో నిందితులను ఎందుకు కాపాడుతున్నారో చెప్పడానికి సిద్ధమా... దళిత వ్యక్తిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన దానికి సమాధానం చెప్పడానికి సిద్ధమా... తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హత్య చేసిన దానికి సమాధానం చెప్పడానికి సిద్ధమా..! అంటూ బాలకృష్ణ ప్రశ్నలు సంధించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సంసిద్ధులవ్వాలని పిలుపునిచ్చారు.

వైసిపి ఎమ్మెల్యేలపై బాబు ఫైర్

రా..కదిలి రా సభ సందర్భంగా వైసిపి ఎమ్మెల్యేపై చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కోక్క వైసిపి ఎమ్మెల్యే పేరు చెబుతూ వారి అవినతి, అక్రమాలను ఎండగట్టారు. పెనుకొండ శంకర్ నారాయణ పెద్ద ఎత్తున అవినీతి చేశాడన్నారు. రాప్తాడులో తోపుదుర్తి అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అక్కడ లేఅవుట్ వేయాలన్నా కప్పం కట్టాల్సిందే అన్నారు. రైతు భూమి అమ్మలేదని మామిడి చెట్లు నరికించిని సంస్కృతి తోపుదుర్తిది అన్నారు. ధర్మవరాన్ని పీడిస్తున్న కేటుగాడు ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్నారు. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి లక్ష్మీ నరసింహ స్వామిని కూడా వదల్లేదన్నారు. ఇలా ఒక్కో ఎమ్మెల్యే గురించి చంద్రబాబు చెబుతూ వచ్చే ఎన్నికల్లో వారిని ఓడించాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ, శ్రీసత్య సాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల టీడీపీ ఎన్నికల పరిశీలకులు కోవెల మూడి రవీంద్ర, డాక్టర్ నరసింహ రావు, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘు నాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, జనసేన నాయకులు టీసీ.వరుణ్, చిలకం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రా కదలిరా సభలో పాల్గొన్న జిల్లా టిడిపి నాయకులు

ఫిర్యాదు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు స్పందనలో ఇచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీతో పాటు డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వార్డు గ్రామ సచివాలయాలకు ఆర్డినేటర్ శివారెడ్డి, డిపిఒ విజయ్ కుమార్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 187 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కలెక్టరేట్ లో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో ఫిర్యాదు దారులు వస్తారన్నారు. వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, బిసిహెచ్ఎస్ఎంటి నాయక్, డిసిఒ కృష్ణనాయక్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, వ్యవసాయ అధికారి సుబ్బారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు పరిధిలో డిసెంబర్, జనవరి నెలల్లో నిర్వహించిన బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ ఫలితాలు, బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15), (ఆర్19) సప్లిమెంటరీ ఫలితాలు, బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15 లాస్ట్ ఛాన్స్) ఫలితాలు, బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్15 లాస్ట్‌ఛాన్స్) సప్లిమెంటరీ ఫలితాలు, ఎమ్మెస్సీ నాలుగవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్ర మోహన్ రెడ్డి సోమవారం తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని తెలిపారు.

అంధకారంలో 'పురం' కాలనీలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణంలోని చైతన్య నగర్, ఆర్‌టిసి కాలనీలు, త్యాగరాజ్ నగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 5 గంటలకు పైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతాలన్నీ అంధకారంలో ఉన్నాయి. విద్యుత్ అంతరాయంపై ఆయా ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ స్పందించలేదని ఆ ప్రాంత ప్రజలు వాపోయారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో డిఈని సంప్రదించగ 18 కెవి లైన్‌లో సమస్య రావాడంతో అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేయిస్తున్నామని తెలియజేశారు.

కరెంటు లేక అంధకారంలో ఉన్న చైతన్య నగర్

భూసమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

రెవిన్యూ డివిజన్ పరిధిలోని నెలకొన్న భూసమ్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాగు భూమి, ఇళ్ల స్థలాలు, నాసన్, బెల్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, గిరిజన కుటుంబాలకు రీ ప్లేస్‌మెంట్,కల్లు గీత వనాన్ని తొలగించిన వారిపై చర్యలు తదితర సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న అధ్యక్షతన సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ నాయకత్వంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులతో కలిసి సబ్ కలెక్టర్‌కి అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సబ్ కలెక్టర్ ను సిపిఎం నాయకులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని భూములు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై రెండు మూడు సంవత్సరాల నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక నిరసనలు, పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. పరిష్కారం చేస్తామని అధికారుల హామీ ఇచ్చి ఆతరువాత పట్టించుకోవటం లేదని విమర్శించారు. అనంతరం కార్యాలయంలోని కోర్టు హాల్ సబ్‌కలెక్టర్ నాయకులతో కలిసి చర్చించారు. ప్రధానంగా రొద్దం మండలం ఆర్. లోచెర్ల పొలం సర్వే నంబర్ 60లో ప్రభుత్వ భూమిలో ఉన్న కల్లు గీత వనాన్ని తొలగించి బూడిద చేసినా దుండగులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అందుకు పోలీసు అధికారులతో చర్చిస్తానని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. అదే విధంగా నాసన్ , బెల్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఉద్యోగాల కల్పన విషయం తొందరలోనే పరిష్కారం చేస్తానని స్పష్టం చేశారు. సాగు భూములు, ఇళ్లస్థలాల పట్టాలు విషయంలో ఎన్నికలు అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, తెలుగు నాడు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నీళ్ల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వెంకటరాముడు, కల్లు గీత కార్మికులు గోపాల్, లక్ష్మినారాయణ, భూ నిర్వాసితులు వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, వెంకట్రాముడు, సాగుదారులు అనితమ్మ, రామాంజనమ్మ, నిర్మల, మీనా, మాబు, శ్రీనివాసులు ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు వర్షిని, నాగమణి, జయంతి, రహంతుల్లా , చందు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వండి

ఆందోళనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మించుకుంటున్న బడాబాబుల నుంచి భూములు స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇంటి, సాగు పట్టాలు ఇవ్వాలని లేబర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎల్‌ఆర్‌పిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆసంఘం నాయకులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట బైటాయించి నినాదాలు చేశ్శారు. ఈ సందర్భంగా ఎల్ఆర్‌పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నూతిమడుగు గోవిందరెడ్డి మాట్లాడుతూ పేదలకు సెంటు భూమి ఇమ్మంటే భూములు లేవని చెబుతున్న అధికారులు పెద్దలు ఆక్రమించుకున్న భూములపై మాత్రం పెదవి విప్పరని విమర్శించారు. కొత్తచెరువు మండల కేంద్రంలో సర్వే నెంబర్ 483-1లో 164 ఎకరాలు ఉందన్నారు. పుట్టపర్తి మండలం ఎనుములపల్లి పొలం సర్వే నెంబర్ 454-2, 454-3, 454-6 లో 3.06 ఎకరాలు, కప్పల బండ పొలంలో 127-3ఏ, 127-3బి, 127-2, 195-3, 195-4, 195-5 లో మొత్తం 14.61 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధునికి ఇచ్చిన ఈ భూమిని బడాబాబులు గద్దల్లా పంచుకుని కోట్లు సంపాదిస్తున్నారని విమర్శించారు. అలాగే కప్పల బండ పొలంలో 308 సర్వే నెంబర్ లో 13.32 ఎకరాలు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. ఇలా ఎన్నో ఎకరాలు అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ భూములను ప్రభుత్వం పేదలకు ఇంటి, సాగు పట్టాలు ఇవ్వకుంటే తామే పంచుతామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి, నాయకులు నరసింహులు, సాకే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు 'యశోద'విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థులు గత నెల 8వతేదీ నుంచి 12వతేదీ వరకు డిల్లీలో జరిగిన త్రోబాల్ పోటీలలో ప్రతిభ కనబరచి త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. తమ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న నాగసాయిమిథి, 9వతరగతి చదువుతున్న మౌనిక, వైష్ణవి త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపిక కావడంతో పాఠశాల డైరక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూప్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎం పికైన విద్యార్థులు ఈనెల 11 నుంచి 15వతేదీ వరకు పశ్చిమబెంగాల్లో జరిగే త్రోబాల్ ప్రీమియర్ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.

ప్రతిభా విద్యార్థులతో యశోదపాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్

'తమ్ముళ్ల' కొట్లాట.. అట్టుడికిన బత్తలపల్లి..!

- సూర్యనారాయణ, శ్రీరామ్ మద్దతుదారుల ఘర్షణ
- 25 వాహనాలు ధ్వంసం, ఆరుగురికి గాయాలు

రాళ్ల దాడిలో ధ్వంసం అయిన కారు.. గాయపడిన సూర్యనారాయణ మద్దతుదారుడు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధర్మవరం నియోజకవర్గలోని ప్రతిపక్ష టిడిపిలో గ్రూపు తగదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. ఈ సారి ఏకంగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేంత వరకు పరిస్థితి వెళ్లింది. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, నియోజవకర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మద్దతుదారులు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. చంద్రబాబు నాయుడు తలపెట్టిన రా..కదిలి రా కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో బత్తలపల్లి మండల కేంద్రంలో ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, పరిటాల శ్రీరామ్ వర్గీయులు బత్తలపల్లి మండల కేంద్రంలో ఎదురెదురుగా తలబడి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో ఇరు వర్గాలకు చెందిన దాదాపు 25 వాహనాలు ధ్వంసం అయ్యాయి. రాళ్ల దాడిలో ఆరుగురు గాయపడ్డారు. దాదాపు మూడు గంటల పాటు చోటు చేసుకున్న ఈ ఘర్షణలతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకర్గం కేంద్రం సమీపంలోని కియా వద్ద టిడిపి ఆధ్వర్యంలో రా..కదిలి రా కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొనేందుకు ధర్మవరం నియోజకర్గం నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున వారి అభిమానులు వేరువేరుగా బయల్దేరారు. వందలాది వాహనాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల నుంచి బత్తలపల్లి మీదుగా చంద్రబాబు బహిరంగ సభకు బయల్దేరారు. బత్తలపల్లి టిడిపి కార్యాలయం వద్దకు సూర్య నారాయణ మద్దతుదారుల వాహనాలు రాగానే శ్రీరామ్ మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిగా సూర్యనారాయణ వర్గీయులు కూడా నినాదాలు చేశారు. శ్రీరామ్, సూర్యనారాయణకు మద్దతుగా వారివారి అనుచరులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ రాళ్లదాడిలో సూర్యనారాయణ మద్దతుదారులకు చెందిన 20 వాహనాలు, శ్రీరామ్ మద్దతుదారులకు చెందిన 5 కార్లు ధ్వంసం అయ్యాయి. రాళ్ల దాడిలో ఇరు వర్గాలకు చెందిన ఆరుగురి తలలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో టిడిపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముదిగుబ్బ, ధర్మవరం సిఐలు యతీంద్ర, కరుణాకర్‌లు సిబ్బందితో బత్తలపల్లికి చేరుకున్నారు. ఇరువర్గాల వారిని అక్కడి నుంచి చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దీంతో సమస్య సర్దుమనిగింది. కాగా టిడిపిలో నెలకొన్న ఈ ఘర్షణ వాతావరణం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో అన్న అందోళన టిడిపి నాయకుల్లో వ్యక్తం అవుతోంది.

ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా

రాత్రికి రాత్రే పునాదులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి సమీపంలో బైపాస్ రోడ్డు వెళ్తుండటంతో రోడ్డుకు అనుకుని ఉన్న గుట్టలు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి కన్పిస్తే చాలు భూబకాసురులు కబ్జాకు పాల్పడుతున్నారు. కదిరి పట్టణంతో పాటు చుట్టుపక్కల సమీపంలో ప్రభుత్వ భూమి వాగు పరంబోకు కనిపిస్తే చాలు కబ్జారాయుళ్ల కన్ను వాటిపై పడిపోతుంది. రాత్రికి రాత్రే ఆభూముల్లో గుడిసెలు, లేదా పునాదులు లేదా కంచె ఏర్పాటు చేసేసి కబ్జాలకు పాల్పడటం కదిరి ప్రాంతంలో పరపాటిగా మారింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు రెవెన్యూ లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది కబ్జాదారుల ప్రలోభాలకు తలొగ్గి ప్రభుత్వ భూములు ఎక్కడున్నాయో గుర్తించి వారికి సమాచారం చేరవేస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే సంబంధిత అధికారులకు కనిపించడం లేదా లేక కబ్జారాయుళ్లతో జతకట్టి సొమ్ము చేసుకుంటున్నారా అన్న అనుమానాలు,ఆరోపణలు ప్రజలనుండి వ్యక్తమవుతున్నాయి. గతంలో జాతీయ పార్టీ లో ఉన్న ఒక నాయకుడు అప్పట్లో కదిరి పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలో సర్వే నెంబర్ 305 లో కొంత భూమి కొనుగోలు చేసి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి 40 సెంట్లు దాకా కబ్జాకు పాల్పడినట్లు సమాచారం. అలాగే ఆ సర్వే నెంబర్‌కు సమీపంలోనే మరో సర్వే నెంబర్లో మరో నాయకుడు తన భూమికి అనుకోని ఉన్న ప్రభుత్వ భూమి అర ఎకరం మేర ఆక్రమించుకుని తన భూమిలో కలిపేసుకుని అమ్మేసినట్లు తెలుస్తోంది. అలాగే నాలుగు సంవత్సరాలు క్రితం పేదలకు పట్టాలు పేరుతో ఓ చోటా నాయకుడు చక్రం తిప్పి ప్రభుత్వ భూమిలో అనర్హులు పేరుతో భారీ ఎత్తున పట్టాలు పొంది వాటిలో చాలా వరకు అమ్మేసి పెద్ద మొత్తంలో సొమ్ముచేసుకోవడమే కాకుండా అప్పట్లో అధికారులకు భారీ మొత్తంలో నగదు చెల్లించినట్లు ఆరోపణలు అప్పట్లో వెలువడ్డాయి. కదిరి బైపాస్ రోడ్డు పక్కన 124 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ కార్యాలయం కోసం స్థలం కేటాయించారు. అస్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొంతమంది కన్ను ఆ స్థలం పడింది. కొంతమంది నకిలీ పట్టాలు తయారు చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలను అడ్డుపెట్టుకుని లక్షలాది రూపాయల విలువచేసే భూములు కొట్టేయడానికి పక్కా ప్లాన్ రచించారు. అందులో భాగంగా అమాయక ప్రజలను అడ్డుపెట్టుకొని రాత్రికి రాత్రే పునాదులు వేసేయడం గమనార్హం. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న విషయం కొందరు రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు చూసీ చూడనట్లు వ్యవహారిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాలకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు భవిష్యత్ లో కబ్జాలకు గురి కాకుండా గట్టి చర్యలు తీసుకొని ప్రభుత్వ భూముల్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో వేసిన పునాది

సమస్యను వివరిస్తున్న మహిళలు

పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయండి

కొత్తచెరువు రూరల్: కొత్తచెరువు మండలంలోని లోచర్ల పంచాయతీ పరిధిలోగల 31వ పోలింగ్‌కేంద్రాన్ని మామిళ్లకుంట క్రాస్‌లో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మామిళ్ళకుంట క్రాస్‌లో దాదాపు 500 ఓట్లు ఉన్నాయని ఈ నేపథ్యంలో మామిళ్లకుంట క్రాస్‌లోనే పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఓటర్లు గుంటిపల్లికి వెళ్లి ఓటు వేయాలంటే రెండుకిలోమీటర్ల దూరం అవుతుందని వృద్ధులు, వికలాంగులు వెళ్లలేని పరిస్థితి ఉందని చెప్పారు. గుంటిపల్లి గ్రామంలో కేవలం 200 ఓట్లు మాత్రమే ఉన్నాయని మిగిలిన ఓట్లన్నీ మామిళ్ళకుంట క్రాస్‌లో ఉన్నాయని అన్నారు. అధికారులు స్పందించి మామిళ్ళకుంట క్రాస్‌లో పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిళ్లకుంట క్రాస్ కి చెందిన ఓటర్లు గౌరమ్మ, రాములమ్మ, అంజనమ్మతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని మణికంఠ కాలనీలో గల ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ అనురాధ, ఎసిడిపిఒ గీతాబాయి, సూపర్వైజర్ సుభారాణి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న హక్కులు, ప్రభుత్వ పథకాలు, మహిళా చట్టాలు, సమాజంలో మహిళల పాత్ర తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయానికి వేలం

బత్తలపల్లి : మండలంలోని సంజీవపురం వద్ద వెలసిన కాటి కోటేశ్వర క్షేత్రంలో టెంకాయల విక్రయానికి నిర్వహించిన వేలం పాటలో ముష్టూరు గ్రామానికి చెందిన నర్సింహుడు అనే వ్యక్తి దక్కించుకున్నారు. రూ. 2. 10 లక్షలకు టెంకాయల విక్రయాన్ని దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో కాటి కోటీశ్వర స్వామి ఆలయ ధర్మకర్త సుధాకర రెడ్డి, కొండన్న, ముసలప్ప, శివయ్య, ధర్మవరం శివయ్య, బాలప్ప, తిక్కయ్య, తలారి నరసింహుడు, బోయ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

ధర్మవరం టౌన్ :పట్టణంలోని చక్రవర్తి థియేటర్ ఎదురుగా కెపిటి వీధిలో ఉన్న శ్రీ శివయంబు కాలభైరవ స్వామి ఆలయంలో ఈనెల 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు ధనుంజయ ఆచారి, ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పల్స్ పోలియో పరిశీలన

లేపాక్షి : లేపాక్షి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని డిఎంహెచ్ఎం డాక్టర్ కృష్ణారెడ్డి, పల్స్ పోలియో జిల్లా పోగ్రాం ఆఫీసర్ విక్రమ్ సోమారం పరిశీలించారు. వందశాతం పల్స్ పోలియోకు చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రొద్దం : రొద్దం జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో 120మందికి గాను 111మంది హాజరు అయినట్లు ప్రిన్సిపల్ తెలపారు.

పంచ లోహాల ప్రతిమ వితరణ

బత్తలపల్లి : మండలంలోని గంటాపురం గ్రామంలో వెలసిన శ్రీవిరాట్ గురజాల అప్పస్వామికి పంచ లోహాల ప్రతిమను వితరణ చేశారు.సోమవారం బత్తలపల్లికి చెందిన శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ యజమాని ముక్తాపురం సోమశేఖరరెడ్డి, ముక్తాపురం సరస్వతి దంపతులు రూ. 35వేలు విలువచేసే పంచలోహ ప్రతిమతో పాటు అప్పస్వామికి వెండి మీసాలు, కన్ను ఆభరణాలను చేయించి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు.

వికలాంగులకు రాయితీ రైల్వే పాసులు

కదిరి అర్బన్ :
వికలాంగులకు రాయితీ రైల్వే పాసులు మంజూరు చేయడానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సోమవారం, మంగళవారం రెండు రోజులు కేంద్రాన్ని నిర్వహిస్తామని ఆయన అన్నారు.

పెనుకొండ నగర పంచాయితీ, శ్రీ సత్యసాయి జిల్లా
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

టెండరునోటీసు నెం. 82/PKD/General Fund - 2023 - 2024/E1 (3rd call), 84/PKD/General Fund - 2023 - 2024/E1 (2nd call), & 85, 86/PKD/General Fund - 2023 - 2024/E1 (Short tender), తేది: 04-03-2024

పని పేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
1. GENERAL FUND (2023-2024)	04 నెం.	రూ॥ 21.99 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 05-03-2024
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ చివరి తేది: 11-03-2024
బిడ్ తెరిచే తేది : 11-03-2024

తదుపరి వివరములకు www.tender.apeprocurement.gov.in "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్ లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా:
కమీషనర్, పెనుకొండ నగర పంచాయితీ,
ఫోన్ నెం: 9100253206.

సం/- S. వంశీ కృష్ణ భార్గవ
కమీషనర్
పెనుకొండ నగర పంచాయితీ

రాష్ట్ర దశ, దిశ మార్చే ఎన్నికలు : టిడిపి నాయకులు

బహిరంగసభలో మాట్లాడుతున్న సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర దశా, దిశ మార్చే ఎన్నికలు 45 రోజుల్లో జరగనున్నాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. పెనుకొండలో నిర్వహించిన రా కదలిరా సభలో ఆయన మాట్లాడుతూ జగన్ అంటే అవినీతి, అరాచకం అని అన్నారు. చంద్రబాబు అంటే అభివృద్ధి, సంక్షేమం అని అన్నారు. ప్రస్తుత పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా లేరన్నారు. 125 సంక్షేమ పథకాలను రద్దు చేసి రాష్ట్ర ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి అన్యాయం చేశారన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారన్నారు. ఒక్కసారి ఓటు వేస్తే అన్ని ధరలు పెంచారని ఇక రెండోసారి ఓటు వేస్తే కొంపలు ముంచు తాడని విమర్శించారు.

అపర భగీరథుడు చంద్రబాబు : జిల్లాలో సాగు, తాగునీరు అందించిన అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. సవితమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రమంచి కియా పరిశ్రమ ఎదురుగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదలిరా భారీ బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పెద్దపీట వేసింది టిడిపినే అని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలు అబద్ధపు సభలని ఎద్దేవా చేశారు. తన తండ్రి యస్.రామచంద్రారెడ్డికి పెనుకొండ ఎమ్మెల్యే గా అవకాశం కల్పించి 14 శాఖలకు మంత్రిని చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. తిరిగి తనకు అవకాశం కల్పించారని అన్నారు. రా కదలిరా సభకు పెద్ద ఎత్తున విచ్చేసిన టిడిపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజానీకానికి, మహిళలకు, యువతకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకి సవితమ్మ వెంకటేశ్వరరావు దంపతులు పుష్పగుచ్ఛాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు.

ఈ ప్రాంతం ప్రజల రుణం తీర్చుకున్న చంద్రబాబు : టిడిపి అధినేత చంద్రబాబు అనంతపురం జిల్లా ప్రాంత ప్రజల రుణం తీర్చుకున్నారని ఆపార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పార్థసారధి అన్నారు. రా కదలిరా సభలో ఆయన మాట్లాడుతూ పెనుకొండ సమీపంలో నూ.13 వేల కోట్లు వెచ్చించి కియా పరిశ్రమలు తీసుకువచ్చి 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ ను పూర్తి చేసి తద్వారా సాగు తాగునీరు అందించారన్నారు. ఈ ప్రాంతం అన్ని రకాల అభివృద్ధి చెందిందన్నారు. చంద్రబాబు కృషితోనే ఈ ప్రాంత ప్రజలకు ఆర్థిక వెసులుబాటు వచ్చిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి సాధించిందన్నారు. జగన్మోహన్ రెడ్డి వచ్చాక వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయన్నారు. కియా అనుబంధ పరిశ్రమలు జే టాక్స్‌కు భయపడి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యంగా ఈ ప్రాంతం ప్రజలు చంద్రబాబుకు రుణపడి ఉంటారన్నారు. ఎన్నికల యుద్ధానికి ప్రతి ఒక్కరు సంసిద్ధం కావాలని కోరారు. ఈసారి ఎన్నికల్లో 14 ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాల్లో టిడిపి గెలుస్తుందని జోస్యం చెప్పారు.

మహిళాభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శం : వైసిపి

మెగా చెక్కును అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

మహిళాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం రూరల్ మండల వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేణురెడ్డి మాట్లాడుతు తెలుగుదేశం ఇతర ప్రతిపక్షాలతో పాటు ఎల్లో మీడియా నిత్యం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ప్రజలను అభివృద్ధి చేయాలని జగన్ మోహన్ రెడ్డి ఎంతో పారదర్శకంగా నేరుగా వారి అకౌంట్లోకి నగదును బదిలీ చేస్తుంటే చూసి ఓర్చుకోలేని వారు రాష్ట్రంలో అభివృద్ధి లేదంటూ కొత్త ప్రచారాన్ని మొదలు పెట్టారని అన్నారు. అనంతరం మెగా చెక్కును మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగభూషణ, రూరల్ మండల కన్వీనర్ బసిరెడ్డి, నాయకులు బసిరెడ్డి, నాయకులు, వెలుగు అధికారులు, మండల వ్యాప్తంగా ఉన్నా సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళా సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామానికి చెందిన గంగప్ప కుమారుడు రాజమోహనకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడి వైద్యసేవల కోసం చేసిన ఖర్చు కింద రూ. 6.30లక్షల చెక్కును అందజేశారు. హిందూపురం రూరల్ మండలం కగ్గల్లు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి కి గుండెకు శస్త్ర చికిత్స కోసం చేసిన ఖర్చుల నిమిత్తం రూ.65వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వైసిపి నాయకులు వేణురెడ్డి బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మహేంద్రనాథ్ రెడ్డి, నాయకులు సుబ్బిరెడ్డి, నాగేంద్ర, జనార్ధన్, సుమంత్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఇంటింటికీ వెళ్లి రేషన్ ఇవ్వాల్సిందే : జేసీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎండియు ఆపరేటర్లు ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం వీరాపురం పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను పరిశీలన చేసిన అనంతరం రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని తనిఖీ చేశారు. తూకాలలో హెచ్చుతగ్గులు ఉండకూడదని అన్నారు. అందర్ని ఒక చోట గుంపుగా చేసి బియ్యం సరఫరా చేసే విధానాన్ని మానుకోవాలని అన్నారు. వందశాతం ఇళ్ల వద్దకే రేషన్ చేర్చాలని అన్నారు. ఈ మేరకు లబ్దిదారులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల నుండి పిర్యాదులు అందితే చర్యలు తప్పని ఎండియు ఆపరేటర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు ఇరువైపులా ప్రహరీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలోని మొత్కుపల్లి వద్ద ఉన్న పెన్నా నది వంతెనకు ఇరువైపులా ప్రహరీ ఏర్పాటు చేయాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు నాజింబాషా ఉపాధ్యక్షులు సుబ్బరాయప్ప, పట్టణాధ్యక్షులు దాసరి ఈశ్వరయ్య, బీఎస్పీ నాయకులు పెన్నయ్య, మౌలాలి, బాబు, చంద్రశేఖర్, ఖలందర్, రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడికి వినతిపత్రం అందజేస్తున్న బిఎస్‌పి నాయకులు

క్లాప్.. అట్టర్‌ప్లాప్..!

నిరుపయోగంగా మారిన ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు

ప్రజాశక్తి-హిందూపురం

పది గజాల దూరం కూడా కారులో, బైకుల్లో, ఆటోల్లో వెళుతున్న ఈ రోజుల్లో పారిశుధ్యకార్మికులు మాత్రం కాళ్లు అరిగేలా రెక్కలు.. ముక్కలు చేసుకుంటూ... తోపుడు బండిని నెట్టుకుంటూ.. చెత్తను సేకరించాల్సిన దుస్థితి నెలకొంది. 'మారక్తమే.. చెత్త బండికి పెట్రోల్' అంటూ... చెత్తను సేకరిస్తున్న కార్మికులు కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వాలు మారినా..పాలకులు మారినా పారిశుధ్య కార్మికులకు తిప్పలు తప్పడం లేదని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్లాప్ కార్యక్రమం అదిలోనే ఫ్లాప్ అయింది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇంటింట చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన వాహనాల నిర్వహణ చేత కాక పోవడంతో ఆ వాహనాలన్నీ మూలనపడ్డాయి.

గత టిడిపి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర పేరుతో వాహనాల కొనుగోలుకు కోట్లాది రూపాయాలు వృథా చేస్తే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం క్లాప్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించి వాహనాలను కోనుగోలు చేసింది. 2022 ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ వాహనాలకు డ్రైవర్లను నియమించింది. ఒక్కొక్క వాహన డ్రైవర్‌కు రూ. 18,500లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి విధుల్లోకి తీసుకుంది. హిందూపురం పురపాలక సంఘానికి 25 వాహనాలు కేటాయించి, నిర్వహణ బాధ్యతను కడప జిల్లాకు చెందిన రెడ్డి ఎంటర్ ప్రైజెస్ వారికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ వాహనాలతో ప్రతి రోజు అధికారులు సూచించిన ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నారు. మొదటి నెల డ్రైవర్‌కు రూ. 8700లు ఇచ్చారు. గత ఏడాది నుంచి నెలకు రూ. 10,118లు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ. 8వేలు ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు సైతం ప్రతి నెల ఇవ్వక పోవడంతో డ్రైవర్లు వాహనాలను నిలిపి నిరసన తెలిపారు. అయినప్పటికి అటు పాలకులు గాని, ఇటు అధికారులు గాని స్పందించక పోవడంతో గత ఐదు నెలలుగా క్లాప్ ఆటోలు మూలన పడ్డాయి. అయితే మూలన పడేసిన చెత్త బండ్లను అధికారులు కనీసం మరమ్మతు సైతం చేయకుండా కార్మికులకు చెత్త బండ్లను ఇచ్చి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. కార్మికులు కనీసం చక్రాలు సైతం లేని చెత్త బండ్లను తోసుకుంటూ ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ హోదా కలిగిన హిందూపురం పురపాలక సంఘంలో పర్మినెంట్ కార్మికులు 66, కాంట్రాక్టు కార్మికులు 220 మంది ఉంటే అందులో ముగ్గురు మృతిచెందారు. 8 మంది విశ్రాంతి పొందారు. దీంతో 209 మంది విధులు నిర్వహిస్తున్నారు. కరోన సమయంలో రోజు వారి వేతనంతో అవుట్ సోర్సింగ్ కింద మరో 85 మందిని అదనంగా తీసుకున్నారు. మొత్తం 360 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మికుల సంఖ్య తక్కువ ఉన్నప్పటికి ఉన్నా కార్మికులతోనే రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయించడంతో పాటు ఇంటింట చెత్త సేకరణ చేయిస్తున్నారు. దీంతో కార్మికులు వేకువ జామున 5 గంటల నుంచి కాళ్లు అరిగేలా చెత్త బండిని తోసుకుంటు చెత్తను సేకరిస్తున్నారు. చెత్త సేకరణ పూర్తి అయిన వెంటనే తిరిగి రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం వలన మోకాళ్ల నొప్పులు, బండిని తోయడం వలన రెక్కల నొప్పులు వస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెనుకొండలో మరోసారి గెలవబోతున్నాం..

మంత్రి ఉషశ్రీ చరణ్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

ఎన్ని జెండాలు జత కట్టి వచ్చినా పెనుకొండ కోటపై ఎగిరేది వైసిపి జెండానే అని రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని నాగలూరు, మావటూరు, అడదాకులపల్లి పంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పంచాయతీ స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గడప కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. తిరిగి సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందాలంటే జగనన్న సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగలూరు బాబు, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి,మునిమడుగు శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, కోడిపల్లి గోవర్ధన్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

తనకల్లు : మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి 42 వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తనకల్లు మండల కేంద్రానికి చెందిన రైతు మృతిచెందాడు. గ్రామానికి చెందిన రైతు ఎల్లంపల్లి వెంకటరమణ (37) తన కుటుంబ పోషణ నిమిత్తం బాడుగకు ఎద్దులబండిలో పాపాగ్ని నది నుండి ఇసుకను తీసుకొని రావడానికి వెళుతుండగా వెనక నుండి వచ్చిన లారీ ఎద్దులు బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు వెంకటరమణ మృతిచెందాడు. ఒక ఎద్దు మృతిచెందింది. మరొక ఎద్దు స్వల్ప గాయాలపాలైంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

హిందూపురం : హిందూపురం సెబ్ అధికారులు లేపాక్షి మండలంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జైలో వాహనంలో సుమారు 40 కేసులు, 1920 టెట్రా పాకెట్ల కర్నాటక మద్యాన్ని గుర్తించారు. వాహనంతో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2.34లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడిన వాహనం టిడిపి నాయకుడు మంగేష్‌ది అని గుర్తించామన్నారు. పరారీలో ఉన్న వారిని అదుపులోకి తీసుకొంటామన్నారు.

జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారిగా నాగభూషణ

పుట్టపర్తి రూరల్ :శ్రీ సత్య సాయి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారిగా నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ చాంబర్లో ఎస్పీ మాధవ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విజయవాడ ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న నాగభూషణం శ్రీ సత్యసాయి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారిగా బదిలీ అయ్యారు. జిల్లాలో అక్రమ మద్యం, అక్రమ రవాణానుపూర్తిగా నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టాలని ,సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

'వైసిపితోనే ప్రజాసంక్షేమం'

ముదిగుబ్బ : వైసిపితోనే ప్రజాసంక్షేమం సాధ్యమని నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ, ప్రజా అభివృద్ధికి పాటుపడుతున్న ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి రానున్న ఎన్నికలలో అండగా నిలవాలని కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలకేంద్రంలోని 5, 6 వార్డులలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, వైసిపి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, ముదిగుబ్బ సర్పంచి లక్ష్మీదేవి గ్రామ సచివాలయాల కార్యదర్శి భాస్కర్, గడ్డం వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్ర, లోకేష్, శ్రావణ్, సుదర్శన్ రెడ్డి, రామిరెడ్డి, శ్యామ్, జయమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

6న ఉద్యోగమేళా

హిందూపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈనెల 6న పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. యం.ప్రగతి, జిల్లా నైపుణ్యాధికారి ఎస్.అబ్దుల్ ఖయ్యూం సోమవారం తెలిపారు. నాలుగు కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసి 18 నుంచి 34 సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ. 13వేలు నుండి 20వేల రూపాయల వరకు వేతనం ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపిక అయిన వారు శ్రీసత్యసాయి జిల్లా లేదా బెంగుళూరు లో ఉద్యోగం చేయాల్సుంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకొని ఉదయం తొమ్మిది గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని కోరారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని వారు కోరారు. ఇతర వివరాలకు 9966682246 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉపాధి సిబ్బంది వేతనాలు పెంచాలి

ఓబుళదేవర చెరువు : ఉపాధి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు,కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రేడ్ కేయించి వేతనాలు పెంచాలని ఉపాధి సిబ్బంది కోరారు. ఈ మేరకు వారు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట టిఎలు, సిఒలు నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్నామని గ్రేడ్ కేటాయించి వేతనాలు పెంచడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన కోరికలు తీర్చాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు, రాజారెడ్డి, చంద్రారెడ్డి, హనుమంతరెడ్డి, ఆంజనేయులు, నాగముని, కంప్యూటర్ ఆపరేటర్లు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలం వేపరాల్ల కు చెందిన దొడ్డి లక్ష్మిదేవి, మల్లయ్యల కుమార్తె వివాహం కోసం రాష్ట్ర వైసీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఆయన తనవంతుగా పెళ్లికూతురు తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న హరిప్రసాద్

ముందస్తు ప్రచారాలు నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలకు డిమాండ్

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న నైరా ఏరు డైట్ పాఠశాల వారు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ పట్టణంలో ఫ్లెక్సీల ద్వారా ముందస్తు ప్రచారాలు నిర్వహిస్తున్నారని వారిపై తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎపిఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ రాజేశ్వరిదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, ఎపిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాహుల్ సురేష్, అమర్నాథ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకనే ఇలాంటి ముందస్తు ప్రచారాలు నిర్వహించడం నిబంధనలను ఉల్లంఘించడమేనని అన్నారు. వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీలు

కదిరి టౌన్ : ఎన్‌వైకె వారి సహకారంతో అరుణ్ కుమార్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు మెడల్స్‌ను అందజేశారు .ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రామ లింగారెడ్డి, ప్రిన్సిపల్ శరత్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేత

నేడు పుస్తక పరిచయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం 1930 నాటి నవల భానుమతి పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. యం.ప్రగతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె సోమవారం మాట్లాడుతు స్వతంత్ర సమరయోధులు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్యక్షులుగా పనిచేసిన యం.వి.పాపన్నగుప్తా రచించిన భానుమతి నవలను దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రస్తుత అధ్యక్షులు పోలిశెట్టి ఓబయ్య ఆవిష్కరిస్తారన్నారు. దీనిని అనంతపురం ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్. అంకె శ్రీనివాస్ పరిచయం చేస్తారన్నారు. ఈ సభలో మదనపల్లెకు చెందిన రచయిత టిఎస్ఎ. కృష్ణమూర్తి, హిందూపురానికి చెందిన ప్రముఖ రచయితలు సడ్లపల్లి చిదంబరరెడ్డి, సిద్ధగిరి శ్రీనివాస్, కల్లూరి రాఘవేంద్రరావు, సాహితీ స్రవంతి సత్యసాయి జిల్లా కన్వీనర్ హరి తదితరులు పాల్గొంటారని తెలిపారు.